క్లుప్తంగా

కబ్జాలకు పాల్పడిన నాయకులను చేర్చుకోవద్దు



గీసుకొండ : గత ప్రభుత్వంలో భూకబ్జాలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కోరారు. మండలంలోని ఆరెపల్లి, ఎలుకుర్తి, కొనాయమాకులలో గురువారం ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు అభిప్రాయాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ తాను భూ ఆక్రమణలను సహించనని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి వచ్చే వారిని కాదంటే వారు బీజేపీలో చేరే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్, నాయకులు ఆకుల రుద్రప్రసాద్, వజ్ర రాజు, కూసం రమేశ్, నాగరాజు, ఎండీ రహీం, బత్తిని భాస్కర్, దిలీప్‌రెడ్డి, మంద రమేశ్, ఆంగోత్ కవిత పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



రాయపర్తి : మండలంలోని రాయపర్తి, పెర్కవేడు, కొత్తూరు తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటేయాలని, వరంగల్ ఎంపీగా కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చేశారు. పెర్కవేడులో నిర్వహించిన ప్రచారంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తీగల సాయిలు, నాయకులు సుతారి యాదగిరి, పుల్లూరు దామోదర్, వెంకటాచారి, ఎడ్లపెల్లి నరేందర్, బండి కుమార్, ఊగ మునిత, వెలిశోజు శేఖర్, దురిశెట్టి రమేశ్, వెంకన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



రాయపర్తి : తమ సమస్యలు పరిష్కరించాలని మండలానికి చెందిన ముస్లింలు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని కోరారు. స్థానిక మజీద్-ఏ-నూర్ సదర్ మహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలోని బృందం తొలుత ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. అనంతరం హుస్సేన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మజీద్-ఏ-నూర్ కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రజాక్, కోశాధికారి యూసుఫ్, సభ్యులు ఫెరోజ్, అఫ్రోజ్, షకీల్, వసీమ్, హఫీజ్, అమీర్, కమురోద్దీన్, అక్బర్, షకీల్, రియాజ్, మహబూబ్ పాషా, మల్సూర్, మహమూద్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు షురూ



ఖానాపురం : మండలంలోని పాకాల ఆయకట్టు, బావుల కింద ముందస్తుగా నాట్లు వేసిన రైతులు కోతలు గురువారం షురూ చేశారు. ధాన్యాగార కేంద్రంగా గుర్తింపు పొందిన పాకాల ఆయకట్టు కింద వరి పంటలు సాగయ్యాయి. పంటలు కోత దశకు చేరుకోగా మిషన్లతో రైతులు కోత మొదలు పెట్టారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి తల్లి విజయ (56) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం అంత్యక్రియలు నిర్వహించగా విజయ మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. అంత్యక్రియల్లో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

రాయపర్తి : మండలంలోని కొత్తూరుకు చెందిన గాదె వీరస్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మందాటి సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ కందికట్ల రాధమ్మ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ మోటారుతో మొక్కల రక్షణ

జీపీ నిధులు, దాత సహకారంతో ఏర్పాటు

- పచ్చదనంతో కళకళ
- ఆదర్శంగా కొండాపూర్ జీపీ కార్యదర్శి

నల్లబెల్లి : గ్రామ అభివృద్ధితోపాటు మొక్కలంటే ఆమెకు ప్రాణం. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోతుంటే హృదయం ద్రవించింది. మొక్కలను రక్షించాలని నిర్ణయించుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు దాతలను సహకారం కోరింది. జీపీ నిధులతోపాటు దాత అందించిన సాయంతో సోలార్ మోటారు ఏర్పాటు చేసి మొక్కలను కాపాడుతూ మండలంలోని కొండాపూర్ పంచాయతీ కార్యదర్శి రజిత ఆదర్శంగా నిలుస్తోంది.

హరితహారంలో భాగంగా కొండాపూర్ గ్రామ పంచాయతీలో బృహత్ పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతివనం, కోతుల ఆహార క్షేత్రంలో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలతోపాటు ఔషధ గుణాలు కలిగిన సుమారు 40 వేల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. మండుతున్న ఎండలతో మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో వాటిని ఎలాగైనా రక్షించాలని పంచాయతీ కార్యదర్శి రజిత సమస్యను అధికారులకు వివరించింది. చెట్లకు నీరు అందించేందుకు 5 హెచ్‌పీ కెపాసిటీ కలిగిన సోలార్ మోటారును పంపుసెట్ ఏర్పాటు చేయాలని, అందుకు రూ.5 లక్షలు అవసరమని విజ్ఞప్తి చేసింది. సానుకూలంగా స్పందించిన అధికారులు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3 లక్షలు కేటాయించారు. మిగిలిన డబ్బుల కోసం స్థానికంగా దాతల సహకారం కోరినా ఫలితం లేదు. అయినా రెట్టింపు ఉత్సాహంతో ప్రయత్నించింది. సమస్యను నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్ది గణేశ్‌రెడ్డికి వివరించింది. కొండాపూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరింది. గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉన్న రూ.3 లక్షలు చెల్లించగా.. గణేశ్‌రెడ్డి రూ.4.80 లక్షల విలువ చేసే 5 హెచ్‌పీ కెపాసిటీ కలిగిన సోలార్ మోటారు పంపుసెట్‌ను అందించాడు. ఈ పంపు సెట్‌ను బోరులో బిగించి ఎండుతున్న చెట్లకు ఆమె నీళ్లు పెడుతూ కాపాడుతోంది. ఆమె ప్రయత్నాన్ని గుర్తించిన స్థానికులు, అధికారులు అభినందించారు. విరాళంగా పంపుసెట్ అందించిన గణేశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్



చెట్లకు నీళ్లు అందిస్తున్న సోలార్ పంపు సెట్



కళకళలాడుతున్న చెట్లు

రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా..



అధికారుల ప్రోత్సాహం, స్థానికుల సహకారంతో హరితహారం కార్యక్రమంలో బృహత్ పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతివనం, కోతుల ఆహార క్షేత్రాలను ఏర్పాటు చేశాం. ఇన్నాళ్లు ఏపుగా పెరుగుతున్న చెట్లను కాపాడగలిగాం. ఎండలకు చెట్లు మాడిపోతుండడంతో చూడలేకపోయా. అధికారులను సంప్రదిస్తే నిధులు కేటాయించారు. ప్రభుత్వ నిధులతోపాటు శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్ది గణేశ్‌రెడ్డి సహకారంతో సోలార్ పంపు సెట్ ఏర్పాటు చేసి మొక్కలకు నీళ్లు అందిస్తున్నాం. హరితహారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా.

-రజిత, పంచాయతీ కార్యదర్శి, కొండాపూర్

పల్లెల్లో ఓటింగ్‌శాతం పెరగాలి



కూలీలతో మాట్లాడుతున్న ప్రభాకర్

నర్సంపేట రూరల్ : పల్లెల్లో ఓటింగ్ శాతం పెరగాలని రాష్ట్ర వినియోగదారుల సీఏటీసీఓ కార్యదర్శి గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి సంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగెల్లి సారంగం కోరారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేట, నాగుర్లపల్లి గ్రామ శివారులోని చెరువుల్లో పూడిక పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు గురువారం కరపత్రాలు అందిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్, ప్రభాకర్, సారంగం మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటేసేలా సమాజంలోని ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు రాజు

నెక్కొండ : మండలంలోని సూరిపల్లి-లింగగిరి అడ్డా చైతన్య ఆటో యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా గడ్డం రాజుగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో నూతన కార్యవర్గాన్ని సంఘం సీనియర్ నాయకుడు మందుల కవిరాజ్ గురువారం ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా మేడబోయిన మాధవులు, ప్రధాన కార్యదర్శిగా వన్నాల సతీశ్, కోశాధికారిగా అనువుల సురేశ్, సభ్యులుగా కొంకాల రవికుమార్, మంద వేణు ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం అధ్యక్షుడు రాజుగౌడ్ మాట్లాడారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సభ్యుల సమస్యలను ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా పాటుపడతానని చెప్పారు. సంఘ బలోపేతానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. కమిటీ ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

సంగెం : మండలంలోని చింతలపల్లి నుంచి వీఆర్ఎన్ తండా మీదుగా ముమ్మడివరం వరకు చేపట్టిన ఆర్ అండ్ బీ బీటీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలిచ్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రూ.3.30 కోట్ల వ్యయంతో పనులు చేపట్టగా రోడ్డు నిర్మాణంలో మొరంకు బదులు మట్టి పోస్తున్నారని ప్రజలు బహిరంగంగానే మండిపడుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటి నుంచి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు కల్వర్టుల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని విమర్శలున్నాయి. రోడ్డుకు నాణ్యమైన మొరం పోయాల్సి ఉండగా నాసిరకం చెరువు మట్టి పోసి చేతులు దులుపుకుంటున్నారని తెలుస్తోంది. ఇకనైనా అధికారులు విచారణ చేపట్టి రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డుకు మొరం బదులు మట్టి పోసిన దృశ్యం

పరిశీలిస్తాం

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తాం. రోడ్డు నిర్మాణంలో మొరం వాడాలి. ఎన్నికల విధుల్లో ఉన్నాం, రోడ్డు పనులను పరిశీలించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మించేలా చూస్తాం

-సుమలత, ఏఈ, ఆర్ అండ్ బీ

బీజేపీతోనే అన్ని వర్గాల సంక్షేమం



దుగ్గొండి : ప్రచారం చేస్తున్న నాయకులు



సంగెం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

దుగ్గొండి : బీజేపీ పాలనతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు లభిస్తాయని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ముద్దునూరు, మైసంపల్లి, స్వామిరావుపల్లి, గుడ్డేలుగులపల్లి గ్రామాల్లో గురువారం ఇంటింటికీ తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో భారత్ కీర్తిప్రతిష్టలను పెంచడంతోపాటు దేశ ప్రజల శ్రేయస్సు, రక్షణకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సీతారాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, నాయకులు రేసు శ్రీనివాస్, పృథ్వీరాజ్, నేదురి రాజేందర్, మనీశ్, విఘ్నేశ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నార్లవాయి, ముమ్మడివరంల్లో..

సంగెం : మండలంలోని నార్లవాయి, ముమ్మడివరం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు చాతాల్ల రమేశ్‌తో కలిసి బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీగా అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వచ్చేలా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు లక్క శ్రీనివాస్, తాళ్లపెల్లి రాజమౌళి, అవనిగంటి సతీష్, పరికి స్వామి, మచ్చిక సుదర్శన్, నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యంషాపులు

నర్సంపేట : పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులు నడుస్తున్నాయని డీబీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు వైన్‌షాపుల యజమానులు అధికారులకు మామూళ్లు ఇస్తూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి పండుగలు, ఎన్నికల సందర్భంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని చెప్పారు. కొందరు అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడుతూ చర్యలు తీసుకోవడం లేదన్నారు. బెల్ట్ షాపులున్న ప్రాంతాల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ జనానికి ఇబ్బందులు కలిగిస్తున్న మద్యం షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాపర్తి జగన్నాథం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్, నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ దేవిక, మండల ఇన్‌చార్జ్ కందకట్ల సురేశ్, మిట్టకడుపుల రజిత, అల్లం రాజక్క, కదురు వెంకన్న, రాపోలు వెంకన్న, గండికోట సమ్మక్క, నాగౌెట్టి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

భూఆక్రమణపై చర్యలు తీసుకోండి



ధర్నా చేస్తున్న ప్రణయ్‌దీప్, నాయకులు

నర్సంపేట : పట్టణంలో చోటు చేసుకుంటున్న భూఆక్రమణలపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత ప్రజాసంఘాల జేఏసీ, బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, పూలే వారసుల రాజ్యం అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, జన పోరాట సమితి రాష్ట్ర బాధ్యుడు పంజాల రాజ్ గౌడ్, దళిత ప్రజాసంఘాల జేఏసీ కోకన్వీనర్ గుంటి వీర ప్రకాశ్ మాట్లాడారు. పట్టణంలోని గాంధీనగర్‌లో దాత దొడ్డ మోహన్‌రావు మూడేళ్ల క్రితం ప్రభుత్వానికి అప్పగించిన కోట్లాది రూపాయల విలువైన అతడి ఇంటి భూమిని కొందరు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ప్రభుత్వానికి మోహన్‌రావు దానం చేసిన భూమిని ఆక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే, ఆర్డీఓ, తహసీల్దార్ స్పందించి సదరు భూమిని రక్షించాలని, ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక నర్సంపేట నియోజకవర్గ నాయకుడు శ్రీరామోజు మురళి, బీసీవై పూలే వారసుల రాజ్యం పట్టణ అధ్యక్షుడు గుడికందుల సంతోశ్, స్వర్ణకార బీసీ సంఘం నాయకులు శ్రీరామోజు కుమారస్వామి, గట్టు నాగరాజు, రవి, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

వర్ధన్నపేట : కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ స్పష్టం చేశారు. పట్టణంలోని భారతి డిగ్రీ కళాశాలలో 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, సామాజిక న్యాయాన్ని సాధించుకుందాం, కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం' కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ పాలన మొదలయ్యాక కోట్ల మంది పేదలుగా మరింత దారిద్ర్యంలోకి నెట్టబడ్డారని, 30 కోట్ల మంది యువత నిరుద్యోగులుగా వేదనకు గురౌతున్నారని, దేశంలోని 450 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కేంద్ర నిధుల్లేక పరిశోధన కుంటుపడిందని, 8 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, కనీస మద్దతు ధర కోసం ధర్నా చేసిన 750 మంది రైతులను పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. కేంద్రంలో మార్పు తప్పదని చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్, పూలే ఆశయ సాధక సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ దశాబ్దకాలంగా బడుగుల కులగణన చేయని మోదీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మంద వీరస్వామి, బీసీ న్యాయవాదుల సంఘం నాయకుడు గునిగంటి శ్రీనివాస్, దయాల సుధాకర్, రాచకొండ ప్రవీణ్ చారి పాల్గొన్నారు.

'మన ఆపద్బాంధవులు' వార్షికోత్సవం



సరుకులు అందజేస్తున్న రామ్మూర్తి దంపతులు

గీసుకొండ : మండలంలోని మనుగొండలో 'మన ఆపద్బాంధవులు' ఫౌండేషన్ నాల్గో వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జబ్బు వెంకటేశ్ ఆదేశాల మేరకు డ్యాగా అరవింద్ అందించిన ఆర్థికసాయంతో ఫౌండేషన్ ప్రతినిధి కర్ణకంటి రామ్మూర్తి-రజిత దంపతులు గ్రామానికి చెందిన అనాథ బాలలైన ఎర్రల స్వప్న, ఎలేంద్ర, శ్రీనులకు కుట్టు మిషన్, నెలకు సరిపడ బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం రామ్మూర్తి మాట్లాడారు. ఇప్పటివరకు 4 వేల మందికి రూ.40 లక్షల విలువైన 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమ, నాయకులు రాజు, మాదాసి పద్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం లేక వెతలు

- చెరువు శిఖంలోనే దహన సంస్కారాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కమలాపురంలో వైకుంఠధామం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎవరైనా చనిపోతే మాదన్నపేట చెరువు శిఖం భూమిలోనే దహన సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో చెరువులో నీరు నిండుగా ఉంటుండడంతో దహన సంస్కారాలు చేయడం కష్టంగా మారుతోంది.

ముత్తోజిపేట గ్రామపంచాయతీ పరిధిలో కమలాపురం ఉండగా గ్రామానికి వైకుంఠదామం లేకపోవడంతో కమలాపురం గ్రామ శివారులో ఉన్న నర్సంపేట మండలంలోని మాధన్నపేట చెరువు శిఖం భూమినే వినియోగిస్తున్నారు. 2017లో కమలాపురంను నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. నాటి నుంచి గ్రామానికి వైకుంఠదామం నిర్మించలేదు. మాదన్నపేట చెరువులో నీరు నిండుగా ఉన్న సందర్భాల్లో చెరువు కట్టపైనే దహన సంస్కారాలు నిర్వహించిన సందర్భాలు కోకొల్లలు. గ్రామస్తులు సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్థలాన్ని కేటాయించకుండానే మున్సిపాలిటీ నుంచి వైకుంఠదామం నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. చెరువు శిఖంలో వైకుంఠదామం నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఐబీ అధికారుల అనుమతి లేకుండా చెరువు శిఖంలో నిర్మిస్తే బిల్లులు రావని తెలియడంతో పనులు వదిలేశారు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వైకుంఠదామం నిర్మాణానికి సరైన స్థలం కేటాయించాలని, లేదంటే చెరువు శిఖంలో నిర్మించేందుకు ఐబీ, రెవెన్యూ అధికారుల అనుమతి ఇచ్చి నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



దహన సంస్కారాలు చేపడుతున్న మాదన్నపేట చెరువు శిఖం భూమి

కార్యకర్తలే పట్టుకొమ్మలు



ఐనవోలు : కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 80 మంది బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనను నమ్మి పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గడపగడపకు తెలియజేయాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గండి మల్లిక రమేశ్, రంజాన్, లెక్కల వెంకటరెడ్డి తదితరులున్నారు.

చెరువులో మొరం తవ్వకాల నిలిపివేత



చెరువులో తవ్వకాలను అడ్డుకుంటున్న రైతులు

సంగెం : మండలంలోని ఎల్గూర్‌రంగంపేట చెరువులో మొరం తవ్వకాలను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. గీసుకొండ మండలం మచ్చాపూర్ నుంచి మొండ్రాయి, నల్లబెల్లి మీదుగా చెన్నారావుపేట వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల కోసం సదరు నిర్మాణ సంస్థకు ఐబీ అధికారులు అనుమతి ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు చేపట్టగా జనగాం రమేశ్ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు అడ్డుకుని ఐబీ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఐబీ ఏఈ హమీద్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టారని తెలిపారు. ఇక నుంచి వీఆర్ఏ సమక్షంలో 3 ఫీట్ల మేర తవ్వకాలు జరిగేలా చూస్తామని తెలిపారు.

నివాళి

దుగ్గొండి : మండలంలోని చాపలబండకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి సోదరుడు కంచరకుంట్ల రాజిరెడ్డి (46) గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కురంగడ్ల రమేశ్‌ను అతడి తండ్రి మొగిలయ్య ఇటీవల మృతి చెందగా సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) నాయకుడికి..

నెక్కొండ : మండలంలోని రెడ్లవాడకు చెందిన ఎంసీపీఐ(యూ) నాయకుడు పోలెపల్లి లక్ష్మయ్య (75) మృతి చెందగా ఆయన మృతదేహానికి వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాయకులు నివాళులర్పించారు. అనంతరం రవీందర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మయ్య భూస్వామ్య, పెత్తందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తు చేశారు. లక్ష్మయ్యకు భార్య రామక్క, ముగ్గురు పిల్లలున్నారు.

కుక్కల పట్టివేత



పర్వతగిరి : మండలంలోని అన్నారంలో ప్రత్యేక అధికారి పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మోయిన్, సిబ్బంది ఆధ్వర్యంలో కుక్కలను గురువారం పట్టుకున్నారు. కుక్కల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామసభ తీర్మానం మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టుకున్న కుక్కలను అడవిలో వదిలి వేయనున్నట్టు అధికారులు తెలిపారు.

6న సర్వసభ్య సమావేశం

సంగెం : ఈనెల 6న మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కళావతి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.